ఆర్‌యూలో 'అమ్మ పేరిట మొక్క'



మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌యూ అధికారులు


మొక్కలు నాటుతున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, విద్యార్థినులు

కర్నూలు కల్చరల్: పర్యావరణాన్ని రక్షించుకునేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాల్సిన తరుణం ఆసన్నమైందని రాయలసీమ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 'అమ్మ పేరుతో ఒక మొక్క' నాటండి (ఏక్ పేడ్ మా కే నామ్) అని దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు వర్సిటీ ఆవరణలో మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వన మహోత్సవానికి ఊతమిచ్చేందుకు ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. వర్సిటీలో సుమారు 2 వేల మొక్కలు నాటినట్లు చెప్పారు. అన్ని విద్యా సంస్థల్లో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో వలంటీర్లు బాధ్యతగా స్వీకరించి విద్యార్థుల చేత మొక్కలు నాటించాలన్నారు. వన సంపదను పెంచుకుంటే స్వచ్ఛమైన ఆక్సిజన్ పొందడంతో పాటు వర్షాభావ పరిస్థితులు, గ్లోబల్ వార్మింగ్ నుంచి గట్టెక్కవచ్చన్నారు. వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.నాగరాజు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎన్.నరసింహులు, ఆర్‌యూ హాస్టల్స్ చీఫ్ వార్డెన్ ప్రొఫెసర్ విశ్వనాథరెడ్డి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హరిప్రసాద్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ కేవీ రత్నం, డాక్టర్ బి.విజయ్, డాక్టర్ ఎస్.నాగ చంద్రుడు, బి.వి. శివ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


మొక్కను నాటుతున్న విద్యార్థినులు

స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

కర్నూలు సిటీ: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, విద్యార్థులకు రక్షణ లేని ఎడిఫై స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రగతిశీల విద్యార్థి సంఘం (పీఎస్‌యూ) నాయకులు మంగళవారం డీఈఓ కాగిత శామ్యూల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ.. ఎడిఫై స్కూల్‌కు ఒక వైపు గ్యాస్ గోదాం, మరోవైపు పెట్రోల్ బంకు ఉన్నాయన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడడం సరైంది కాదన్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి ఆ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే సీబీఎస్‌ఈ సిలబస్ పేరుతో తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, స్కూల్‌లో ఎలాంటి వసతులు కల్పించడం లేదని, కండిషన్ లేని బస్సులు నడుపుతున్నారన్నారు. అధికారులు విచారణ చేసి స్కూల్‌ను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు నవీన్, వేణు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సఖి కేంద్రంపై అవగాహన పెరగాలి

కర్నూలు(అర్బన్): జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పరిధిలోని సఖి వన్‌స్టాప్ సెంటర్‌పై అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ పీడీ పి.వెంకటలక్ష్మమ్మ కోరారు. మంగళవారం స్థానిక క్లస్టర్ యూనివర్సిటీలోని విద్యార్థినులకు వంద రోజుల అవగాహన కార్యక్రమంలో భాగంగా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. జెండర్ సెన్సిడైజేషన్‌లో భాగంగా సమానత్వం, ఆడపిల్లల చదువుకు ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. మహిళలు పనిచేస్తున్న ప్రదేశాలలో ఇబ్బందులకు గురైతే లైంగిక వేధింపుల నిరోధక చట్టం –2013 గురించి ప్రతిఒక్కరు తెలుసుకోవాలన్నారు. అలాగే పోక్సో చట్టం అమలవుతున్న తీరు గురించి వివరించారు. మహిళలు ఎదుర్కొంటున్న అసమానతలు, వేధింపులపై ఫిర్యాదు చేసేందుకు అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ఐసీసీ) ఏర్పాటు గురించి తెలియజేశారు. వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది పి.మేరీ స్వర్ణలత, వి.జ్యోష్ణ, ప్రియాంక, క్లస్టర్ యూనివర్సిటీ ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుడి మృతి


సలీం (ఫైల్)

కర్నూలు(అర్బన్): నగరంలోని ఐకాన్ ఎగ్జామ్ సెంటర్ సమీపంలో నివాసం ఉంటున్న మాజీ సైనికుడు సలీం సోమవారం రాత్రి మృతి చెందినట్లు జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నర్రా పేరయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీజీలో సర్వీస్ చేసిన అనంతరం ఆయన తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. ఆయన మృతి పట్ల సంఘం తరఫున సంతాపం తెలియజేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

రచయిత కుటుంబానికి ఆర్థిక సాయం

కర్నూలు కల్చరల్: ఇటీవల గుండెపోటుతో మరణించిన ప్రముఖ సినీ, నాటక రచయిత పల్లేటి లక్ష్మీ కులశేఖర్ కుటుంబానికి టీజీవీ కళాక్షేత్రం తరఫున రూ.50 వేల ఆర్థిక సహాయం చేశారు. మంగళవారం కళాక్షేత్రం గౌరవ చైర్మన్ రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ తన ఛాంబర్‌లో కులశేఖర్ అల్లుడు మురళికి ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ 1998 నుంచి కులశేఖర్ టీజీవీ కళాక్షేత్రానికి ఆస్థాన రచయితగా ఉన్నారన్నారు. 38 నంది అవార్డులు రావడానికి ఆయన రచనలు కారణమన్నారు. గతంలో ఆయన గుండెకు శస్త్ర చికిత్స చేసినప్పుడు కళాక్షేత్రం తరఫున రూ.లక్ష ఆర్థిక సహాయం అందించిన అంశాన్ని గుర్తు చేసుకున్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, సభ్యులు సంగా ఆంజనేయులు, గాండ్ల లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

కర్నూలు (టౌన్): స్వాతంత్య్ర వేడుకలను పురస్కరించుకొని బుధవారం ఉదయం 7.30 గంటలకు నిర్వహించనున్న హర్ ఘర్ తిరంగా ర్యాలీని విజయవంతం చేయాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు పిలుపునిచ్చారు. ఆయన మంగళవారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా క్రీడా సంఘాల కార్యదర్శులు, వ్యాయా మ ఉపాధ్యాయులు, క్రీడా శిక్షకులు, సీనియర్ క్రీడాకారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న హర్ ఘర్ తిరంగా ర్యాలీ లో జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా, సెట్కూర్ సీఈఓ రమణ, ఉన్నతాధికారులు హాజరవుతున్నట్లు చెప్పారు. క్రీడా సంఘాల ప్రతినిధు లు తమ వెంట క్రీడాకారులను తీసుకొచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

రేపు జంతువధ, మాంసాహారం నిషేధం

కర్నూలు (టౌన్): ఈనెల 15వ తేదీన స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకొని నగరపాలక సంస్థ పరిధిలో జంతువధ నిషేధం అమల్లో ఉంటుందని నగరపాలక ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో అన్ని మాంసం దుకాణాలు, కబేళాలు మూసివేయాలని వ్యాపారులకు సూచించారు. ఎక్కడా జంతువులను వధించరాదని, మాంసం విక్రయించరాదని పేర్కొన్నారు. అలాగే హోటల్స్, రెస్టారెంట్లలో మాంసాహారం అమ్మరాదని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై భారీగా జరిమానా విధించడమే గాకుండా వ్యాపార లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

నేడు అఖండ భారత్ సంకల్ప దివస్

కర్నూలు కల్చరల్: విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం 5 గంటలకు అఖండ భారత్ సంకల్ప దివస్ నిర్వహించనున్నట్లు భజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్ వెలగల సాయిరాం పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని గోశాల ఆవరణలోని శ్రీకృష్ణ సప్త గో ప్రదక్షిణ శాల నుంచి వివేకానంద సర్కిల్ వరకు కాగడాల ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. మన లక్ష్యం – అఖండ భారతం పేరుతో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ కార్యకర్తలు, బాధ్యులు, హిందూ బాంధవులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగరాలి


150 అడుగుల తిరంగా జెండాతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

కర్నూలు సిటీ: కుల మతాలకతీతంగా, భాషా ప్రాంతీయ విభేదాలకు తావివ్వకుండా ప్రతిఒక్కరు భారత దేశ అభివృద్ధికి కృషి చేయాలని లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు చైర్మన్ రాయపాటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ఆధ్వర్యంలో కే.ఎస్.ఆర్ పాఠశాలకు చెందిన విద్యార్థి, విద్యార్థినుల చేత 150 అడుగుల జాతీయ జెండాతో వెంకటరమణ కాలనీలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. ప్రతిఒక్కరూ దేశభక్తితో నిస్వార్థంగా పని చేసినప్పుడే సమగ్ర దేశాభివృద్ధి జరిగి, నిజమైన స్వాతంత్య్ర ఫలాలు అందరికీ అందుతాయన్నారు. ఈ నెల 15వ తేదీన ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలన్నారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ కార్యదర్శి లయన్ గోపీనాథ్ మాట్లాడుతూ.. బ్రిటిష్ పాలన నుంచి భారతావనికి స్వాతంత్య్రం అందించేందుకు జరిగిన అనేక పోరాటాల్లో ప్రాణాలర్పించిన మహానుభావులను ఎన్నటికి మరవరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అశోక్, జగదీష్, షరీఫా, ఉదయ్, సుబ్బమ్మ, శారద, శ్రీలక్ష్మీ, క్లబ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల రక్షణకు చట్టం తేవాలి


పెద్దాసుపత్రి వద్ద బైఠాయించిన జూనియర్ డాక్టర్లు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో జూనియర్ డాక్టర్లు సమ్మె ప్రారంభించారు. అత్యవసర సేవలు మినహా ఇతర సేవలను వారు బహిష్కరించారు. దీంతో మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఓపీ సేవల్లో జూడాలు లేకపోవడంతో అసిస్టెంట్ ప్రొఫెసర్లు మాత్రమే రోగులకు వైద్యసేవలు అందించారు. జూడాలు లేకపోవడంతో రోగులకు వైద్యం అందించేందుకు ఆలస్యమైంది. ఈ కారణంగా ఓపీలో రోగుల రద్దీ మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగింది. క్యాజువాలిటీ, ఏఎంసీ, ప్రసూతి విభాగం, ఇతర అత్యవసర విభాగాల్లో మాత్రమే జూనియర్ డాక్టర్లు విధులు నిర్వహించారు. ఈ కారణంగా వార్డుల్లో రెగ్యులర్‌గా జూడాలచే అందించే వైద్యసేవలు అందడంలో ఆలస్యం జరిగి రోగులు ఇబ్బంది పడ్డారు. కాగా పశ్చిమబెంగాల్‌లో ఆర్‌జీ కర్ కళాశాలలో పీజీ వైద్య విద్యార్థినిని అత్యాచారం చేసి హత్య చేసిన ఘటనను నిరసిస్తూ వైద్య విద్యార్థులు, జూనియర్ డాక్టర్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ కార్యాలయం నుంచి ఆసుపత్రి పరిసరాల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం క్యాజువాలిటీ వద్ద గాంధీ విగ్రహం ముందు బైఠాయించి నినాదాలు చేశారు. హంతకులను అరెస్టు చేయాలని, వైద్యులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. దేశంలో నిత్యం ఏదో ఒక చోట వైద్యులపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. వైద్యుల రక్షణకు పటిష్టచట్టం తీసుకురావాలని, దాడులకు పాల్పడిన వారికి తక్షణమే శిక్ష వేసే వరకు ఆందోళన కొనసాగిస్తామని తెలిపారు.

అవయవదానంతో ఆయువునిద్దాం


అవగాహన పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డాక్టర్ బాలమద్దయ్య తదితరులు

కర్నూలు(హాస్పిటల్): అవయవదానంతో మరికొందరికి ఆయువునిద్దామని లయన్స్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ బాలమద్దయ్య పిలుపునిచ్చారు. ప్రపంచ అవయవదాన దినోత్సవం పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్‌ఆర్ హాస్పిటల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలమద్దయ్య మాట్లాడుతూ.. అవయవదానంపై ప్రజల్లో ఉన్న అనుమానాలు, అపోహలను పోగొట్టడానికి ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. న్యూరాలజిస్టు డాక్టర్ రోహిత్ మాట్లాడుతూ బ్రెయిన్‌డెడ్‌కు గురైన వారి నుంచి కుటుంబ సభ్యుల అనుమతితో అవయవాలను సేకరించడం జరుగుతుందని, ఒకరు అవయవదానం చేస్తే 8 మందికి పైగా ప్రాణాలు కాపాడవచ్చన్నారు. లయన్స్ జిల్లా చైర్మన్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ అవయవదానం చేయడానికి వయస్సుతో నిమిత్తం లేకుండా ప్రతిఒక్కరూ ముందుకు రావాలని కోరారు.

నేటి నుంచి హెల్తీ బేబీ పోటీలు


పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్లు రామప్రసాద్, భువనేశ్వరి

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని ఎన్‌ఆర్ పేటలో ఉన్న జీవీఆర్ చిన్నపిల్లల హాస్పిటల్‌లో ఈ నెల 14వ తేదీ నుంచి సెప్టెంబర్ 14వ తేదీ వరకు హెల్తీ బేబీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.భువనేశ్వరి, చీఫ్ కన్సల్టెంట్ డాక్టర్ జీఎస్.రామప్రసాద్ వెల్లడించారు. మంగళవారం హాస్పిటల్‌లో వారు మాట్లాడుతూ.. ఈ పోటీలు రెండు కేటగిరీల్లో నిర్వహిస్తామని, ఏడాదిలోపు ఒక కేటగిరి, 1 – 3 ఏళ్ల వయస్సున్న చిన్నారులకు ఒక కేటగిరీ ఉంటాయన్నారు. సెప్టెంబర్ 17న పేషంట్స్ సేఫ్టీ డే రోజున విజేతల వివరాలు ప్రకటిస్తామని తెలిపారు.

పంద్రాగస్టుకు ఏర్పాట్లు


ఏర్పాట్లపై చర్చిస్తున్న కమిషనర్ రామలింగేశ్వర్

కర్నూలు (టౌన్): నగరంలోని పోలీసు పరేడ్ మైదానంలో గురువారం నిర్వహించనున్న 78వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని నగరపాలక కమిషనర్ రామలింగేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ మున్సిపల్ అధికారులతో కలిసి పరేడ్ మైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరపాలకకు సంబంధించి నీటి సరఫరా, పారిశుద్ధ్య పనులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. నగరపాలక ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఎంఈ షాకీర్, కార్యదర్శి నాగరాజు, ఏఈ ప్రవీణ్‌కుమార్ రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మునిస్వామి పాల్గొన్నారు.

పీఎఫ్, ఈఎస్‌ఐ అమలుచేయాలి

కర్నూలు(సెంట్రల్): ఆర్టీసీలో పనిచేస్తున్న అద్దె బస్సు డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్‌ఐ సదుపాయం కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎండీ అంజిబాబు డిమాండ్‌చేశారు. ఈ మేరకు మంగళవారం కొత్త బస్టాండ్ ఏరియాలో సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీకి, అద్దె బస్సు ఓనర్లకు మధ్య జరిగిన ఒప్పందంలో డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్‌ఐ సదుపాయం కల్పించాలని ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. పైగా కనీస వేతనాలు అమలు చేయకుండా శ్రమ దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. డ్రైవర్లపై పని ఒత్తిడి పెరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఆర్టీసీలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రమాద బీమా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రాంబాబు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి


అభివృద్ధిపనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మేయర్ రామయ్య, ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు: కల్లూరు అర్బన్ పరిధిలోని అన్ని వార్డులలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని నగర మేయర్ బీవై రామయ్య, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్ 31వ వార్డు రాఘవేంద్రనగర్‌లో డ్రైనేజీలు, రోడ్లు తదితర అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మేయర్ రామయ్య మాట్లాడుతూ.. కర్నూలు నగరంలో ప్రాధాన్యతలను అనుసరించి అభివృద్ధి పనులు చేస్తామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. డిప్యూటీ మేయర్ రేణుక, స్థానిక కార్పొరేటర్ (స్టాండింగ్ కమిటీ సభ్యులు) మిద్దె చిట్టెమ్మ, మున్సిపల్ అధికారులు, టీడీపీ కల్లూరు అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోర్టు స్థలం విషయంలో జోక్యం తగదు


మాట్లాడుతున్న 34వ వార్డు కార్పొరేటర్ వెంకటేశ్వర్లు

కల్లూరు: కోర్టులో విచారణ జరుగుతున్న స్థలం విషయంలో టీడీపీ నాయకులు జోక్యం తగదని కార్పొరేటర్ ఎరుకల వెంకటేశ్వర్లు, కో–ఆప్షన్ మెంబర్ కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం సాయంత్రం 34వ వార్డులో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కల్లూరు అర్బన్ 34వ వార్డు నిర్మల్‌నగర్ పార్కు సమీపంలో ఉన్న స్థలంలో గతంలో కొంత మంది పేదలకు ఇంటి పట్టాలు మంజూరయ్యాన్నారు. అయితే మున్సిపాలిటీ అధికారులు ఆ స్థలం మున్సిపాలిటీకి చెందినదన్నారు. ప్రస్తుతం ఈ విషయం కోర్టులో నడుస్తోందన్నారు. అయితే కొన్ని రోజులు క్రితం టీడీపీ నాయకులు మాదన్నతో పాటు కొంతమంది స్థలాన్ని క్లీన్ చేసి కాంపౌండ్ వాల్ నిర్మాణానికి భూమి పూజ చేయడమే కాకుండా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం తగదన్నారు. కోర్టు తీర్పు ఎవరి వైపు వచ్చినా తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. వార్డులో ఎవరైనా అభివృద్ధి పనులు చేస్తే సహకరిస్తామన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


సదస్సులో మాట్లాడుతున్న లీలా వెంకట శేషాద్రి

కల్లూరు: చట్టాలపై ప్రతిఒక్కరికీ అవగాహన అవసరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి పేర్కొన్నారు. కల్లూరు మండల పరిధిలోని చిన్నటేకూరు, ఉలిందకొండ గ్రామాల్లో మంగళవారం ప్రజా వినియోగ సేవలపై శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు వెంకట హరినాథ్ అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులో వితంతు పింఛను, మానసిక అనారోగ్య వ్యక్తుల హక్కుల గురించి వివరించారు. కోర్టులో వ్యాజ్యము దాఖలు చేయకముందే శాశ్వత పీఠమును ఆశ్రయించవచ్చునన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) నాగరాజు నాయుడు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మన్న, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


మ్యాట్‌ల పంపిణీ

కల్లూరు: హార్ట్ టూ హార్ట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని చిన్నటేకూరులోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ ఐఐటీ–నీట్ అకాడమీకి రూ.10 వేలు విలువ మ్యాట్లను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపయోగపడే మ్యాట్‌లను అందజేసిన ట్రస్ట్ అధ్యక్షుడు రవి నాయక్‌ను అకాడమీ ఇన్‌చార్జ్ డైరెక్టర్ ప్రత్యూష అభినందించారు.

అవయవ దానంపై అవగాహన కార్యక్రమాలు

కర్నూలు(హాస్పిటల్): అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు చర్యలు తీసుకుంటామని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రామచంద్రనాయుడు, కార్యదర్శి డాక్టర్ ఎస్వీ రామమోహన్ రెడ్డి చెప్పారు. అంతర్జాతీయ అవయవదాన దినోత్సవం సందర్భంగా మంగళవారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ నుంచి రాజ విహార్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అవయవదానం వల్ల మరో 8 మందికి పునర్జన్మ ప్రసాదించిన వారవుతారన్నారు. మనిషి మరణించాక వారి దేహం మట్టిలో కలిసిపోతుందని, అలాగాకుండా వారి అవయవాలను దానం చేస్తే ఇతరులకు ప్రాణం పోసిన వారవుతారన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి మాట్లాడారు. విద్యావేత్త జి.పుల్లయ్య, ఐఎంఏ సభ్యులు డాక్టర్ మహేంద్రకుమార్, డాక్టర్ మాధవీశ్యామల, డాక్టర్ అల్లారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ సాయివాణి తదితరులు పాల్గొన్నారు.

జల వనరుల ఆక్రమణలను అరికట్టాలి


మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు (టౌన్): సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం నీటి వనరుల సమీపంలో ఆక్రమణలను తొలగించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వాటర్ బాడీస్ ఆక్రమణలపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్లు, జలవనరుల శాఖ అధికారులు, డీపీఓ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆక్రమణలకు సంబంధించి మున్సిపల్, జలవనరుల శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. ఆక్రమణల తొలగింపునకు సంబంధించి ఆర్డీఓలతో చర్చించి ఒక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. వాటర్ బాడీస్ వద్ద ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఆక్రమణలకు గురైన వివరాలను రెవెన్యూ అధికారులకు అందజేయాలని చెప్పారు. సమావేశంలో ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్‌ఓ మధుసూదన్‌రావు, పత్తికొండ ఆర్డీఓ రామలక్ష్మీ, కర్నూలు కమిషనర్ రామలింగేశ్వర్ పాల్గొన్నారు.

కత్తి పోటా.. తుపాకీ తూటానా?

- యువకుడి హత్య ఘటనలో భయానక నిజాలు
- మృతుడి తలలో బుల్లెట్
- పోలీసుల అదుపులో నలుగురు అనుమానితులు
- నంద్యాల డీఎస్పీ పర్యవేక్షణలో విచారణ


సోమవారం హత్యకు గురైన యువకుడి మృత దేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

పాణ్యం: పాణ్యం ఎస్సార్బీసీ కాల్వ వద్ద సోమవారం హత్యకు గురైన యువకుడిని మృతదేహంపై ఉన్న గాయాల ఆధారంగా పోస్టుమార్టం అనంతరం కొత్త కోణం వెలుగు చూసింది. యువకుడిని గొంతుపై భారీ గాయం ఉండడతో అందరు గొంతుకోసి హత్య చేశారని భావించారు. పోస్టుమార్టంలో తలలో బుల్లెట్ ఉండడంతో యువకుడిని పిస్టల్‌తో కాల్చి చంపినట్లు సమాచారం. మృతదేహం వద్ద లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా సోమవారం రాత్రి నుంచి డీఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఉదయం నుంచి వారిని పాణ్యం సర్కిల్‌లో డీఎస్పీ రవింద్రానాథ్‌రెడ్డి విచారిస్తున్నారు. ఈ విచారణలో పలు భయానక విషయాలు బయటికొచ్చినట్లు సమాచారం. హత్యకు గురైన యువకుడిది గుంతకల్లుగా గుర్తించారు. హతుడితో పాటు మరో 8 మంది యువకులు నేరాలే ప్రవృత్తిగా జీవిస్తున్నారు. వీరందరిపై కేసులు అధికంగా ఉన్నట్లు తెలుస్తుంది. పగలు గ్రామాల్లో పర్యటించడం, రాత్రి వేళ ఒంటరివాళ్లు, వీధుల్లో చివరి ఇళ్లనే టార్గెట్ చేసి దొంగతనం చేస్తున్నారు. ఇలాంటి కేసులు ఆ యువకులపై చాలా ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఆదివారం అందరు నంద్యాల చేరుకుని అక్కడి నుంచి పాణ్యంలో మద్యం తీసుకున్నారు. బైక్‌లపై ఎవ్వరు చూడని ప్రదేశంలో మద్యం సేవించి దొంగిలించిన సొమ్ము పంపకాలు చేపట్టినట్లు సమాచారం.పంపకాల్లో తేడా రావడంతో వారి మధ్యే ఘర్షణ జరిగి తుపాకీ కల్చినట్లు అనుమానితులు ఒప్పుకున్నట్లు తెలుస్తుంది. ఆ తర్వాత తుపాకీని పక్కనే ఉన్న ఎస్సార్బీసీ కాల్వలో పడేసినట్లు అంగీకరించారు. దీంతో పోలీసులు గజఈతగాళ్లను కాల్వలో దింపి తుపికీ కోసం గాలించారు. ఈ కేసుల్లో ఇంకా చాలా మంది ఉన్నట్లు గుర్తించారు. వారిని కూడా అదుపులోకి తీసుకోని విచారించాల్సి ఉంది. పాణ్యం సర్కిల్ కార్యాలయంలో అత్యంత గోప్యంగా ఈ విచారణ చేపడుతున్నారు. డీఎస్పీ, ప్రత్యేక బృందం సభ్యులు మాత్రమే విచారణ చేస్తున్నట్లు సమాచారం.